క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ మోడల్‌స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఎం కప్ క్రీడాపోటీల్లో భాగంగా గురువారం పరిగిలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన వి వెంకటేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థి వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ క్రిష్టారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు నిరసనగా ధర్నా

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అనంతగిరి: కేటీఆర్‌పై అక్రమ కేసులకు నిరసనగా శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరన్నారు. పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్, పంపిణీ



విద్యార్థులతో హెచ్‌ఎం చెన్నయ్య, రాంచంద్రయ్య, సంజీవ్ తదితరులు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని కేరెళ్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పూర్వవిద్యార్థి టి. సంజీవ్ ఉచితంగా టైలు, బెల్టులు, ఐడీ కార్డులను పాఠశాల హెచ్‌ఎం చెన్నయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తనంలోనే విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంచంద్రయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, వెంకట్‌రెడ్డి, వనిత, సునిత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో రాణించిన అహ్మద్

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులోని అల్మాస్ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుతున్న అహ్మద్ అనే విద్యార్థి క్రికెట్‌లో రాణించారు. హైదరాబాద్‌లో తెలంగాణ స్కూల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సౌత్ జోన్ టీ20 క్రికెట్ మ్యాచ్‌లో అహ్మద్ పాల్గొన్నారు. అండర్ -14 బాయ్స్‌లో ఎంపికైన అహ్మద్ తన జట్టులో అద్భుత ప్రదర్శన చేసి రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. లీగ్ మ్యాచ్‌లో అద్భుత బౌలర్‌గా టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. దీంతో పాఠశాల యాజమాన్యం అబ్దుల్ ఖాన్మీ, అబ్దుల్ రహమాన్‌లు అభినందించారు.

సీఎం కప్‌కు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

పూడూరు: సీఎం కప్ పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మండల పరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులు చరణ్‌నాయక్, చంటి కబడ్డీలో జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. చరణ్‌నాయక్, చంటి ఇరువురు మండల పరిధిలోని రాకంచర్ల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు. ఈ నెల 28న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో మాజీ సర్పంచ్ పెంటయ్య అభినందించారు.

విద్యార్థులకు స్వెటర్లు, రగ్గులు పంపిణీ

కొడంగల్: పట్టణంలోని ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాల్లో విద్యార్థులకు స్వెటర్లు, ఉలెన్ రగ్గులను గురువారం రాత్రి పంపిణీ చేశారు. శీతాకాలంలో విద్యార్థులు చలి నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం స్వెటర్లు, రగ్గులను సరఫరా చేసిందని ప్రత్యేకాధికారి జైపాల్‌రెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

పశువైద్యం.. దయనీయం!

- శిథిలావస్థలో భవనాలు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- మూడు నెలలుగా ఇన్‌చార్జిలే దిక్కు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



దోమ ప్రాథమిక పశువైద్య కేంద్రం

దోమ: గ్రామాల్లో పశు వైద్యం దయనీయంగా మారింది. పశువులకు, జీవాలకు అందాల్సిన వైద్యం సక్రమంగా అందకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఒక పక్క సిబ్బంది కొరత.. మరో పక్క మందుల కొరతతో పాడి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పశువైద్యశాలలో సరైన సిబ్బంది లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో చేసేదేమి లేక రైతులు ప్రయివేటు వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రకరకాల వ్యాధులతో మూగజీవాలు బాధపడుతున్నప్పటికీ అధికారులు వైద్య సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆయా గ్రామాల్లోని ఉప కేంద్రాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఎప్పుడు కూలుతాయోనని ఆసుపత్రికి వచ్చే పాడిరైతులు జంకుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో దోమ, కిష్టాపూర్ రెండు ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, బొంపల్లి, శివారెడ్డిపల్లి, దిర్సంపల్లి, దాదాపూర్ ఉప పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. వాటిలో రెండు ప్రాథమిక కేంద్రాలకు డాక్టర్లుగా ఆనంద్, జోస్నా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారిని మూడు నెలల క్రితం బొంరాస్‌పేట్, పరిగి మండలం రంగాపూర్ ప్రాథమిక పశు వైద్య కేంద్రానికి బదిలీపై వెళ్లారు. దీంతో అప్పటి నుంచి మండలంలో పశువైద్యాధికారుల పోస్టులు ఖాళీగానే ఉండడంతో ఇన్‌చార్జి బాధ్యతలను సైతం అధికారులు వారికే అప్పగించారు. కానీ పశువైద్యాధికారులకు రెండు మండలాలు కెటాయించడంతో ఎప్పుడు వస్తున్నారో? ఎప్పుడు వెళ్తున్నారో రైతులకు అర్థం కావడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. మిగత నాలుగు సబ్ సెంటర్లలో కూడా డాక్టర్లు లేకపోవడంతో ఒకే ఒక అధికారితో పాటు కంపౌండర్లే చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో పశువైద్యశాలకు ఒక వెటర్నరీ డాక్టర్‌తో పాటు ముగ్గురు వైద్య సిబ్బంది ఉండాలి. కానీ పూర్తి స్థాయిలో వైద్యులను నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కరువు

సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యాక్రమాలను ఏర్పటు చేయాల్సిన అధికారులు అవేవి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ కూడా అవగాహన కార్యక్రమాలను ఇప్పటివరకు ఏర్పటు చేయలేదు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలి పశువులు, మూగజీవాలు సైతం రోగాల బారిన పడుతున్నాయి. దాదాపూ మండల వ్యాప్తంగా 11,850 పశువులు, 9,964 గేదెలు, 26,312 గొర్రెలు, 17163 మేకలు ఉన్నాయి. వర్షకాలంలో సీజనల్ వ్యాధులు, చలికాలంలో ముసర వ్యాధులు మూగజీవాలకు ఎక్కువగా వస్తుంటాయి. అవి రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు, సలహాలు ఇవ్వాల్సిన అధికారులు ఇప్పటివరకు ఇవ్వడంలేదని రైతులు మండిపడుతున్నారు.

శిథిలావస్థకు చేరిన సబ్ సెంటర్లు

మండలంలోని బొంపల్లి, శివారెడ్డిపల్లి, దిర్సంపల్లి, దాదాపూర్ గ్రామాల్లో పశు వైద్యశాలల సబ్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో బొంపల్లి, శివారెడ్డిపల్లి గ్రామంలోని సబ్ సెంటర్లు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడో నిర్మించిన ఈ భవనాలకు అధికారులు కనీస మరమ్మతులు కూడా చేయించడంలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే నీరు ఆసుపత్రిలో పడుతున్నాయని, దీంతో రికార్డులు, మందులు పాడైపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రయివేటు వైద్యులే దిక్కు



మూగజీవాలకు అందాల్సిన వైద్యం మండలంలో సక్రమంగా అందడం లేదు. డాక్టర్లు లేక పశువు ఆసుపత్రులు మూగబోయాయి. దీంతో ప్రైవేటు వైద్యులే దిక్కవుతున్నారు. ఇంచార్జులుగా వైద్యాధికారులు ఉన్నప్పటికీ ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని దుస్థితి నెలకొంది. పశువులు, గొర్రెలు, మేకలకు వివిధ రకాల వ్యాధులు వస్తున్నాయి. కనీస అవగాహన కల్పించే నాథుడే కరువయ్యారు.

– బాల్‌రాజ్, రైతు, మోత్కుర్

వైద్యులను నియమించాలి



ప్రభుత్వ ఆసుపత్రులు పేరుకే ఉన్నాయి. ఏ ఒక్క ఆసుపత్రిలో సక్రమంగా వైద్యులు, మందులు లేవు. ఉన్న ఆసుపత్రిలో డాక్టర్లు బదిలీ కావడంతో ఆసుపత్రులు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. దీంతో పశువులకు వైద్యం అందించాలంటే ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. వెంటనే ప్రభుత్వం వైద్యులను నియమించాలి.

– వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ, బొంపల్లితండా

ఇంచార్జిగా విధులు నిర్వహిస్తున్నాం



ప్రాథమిక పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది లేని విషయం వాస్తవమే. కానీ తాము ఇంచార్జిగా విధులు నిర్వహిస్తున్నాం. కొన్నేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహించినప్పటికి ఇటివలే బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లాం. జిల్లా అధికారుల ఆదేశానుసారం మళ్లీ ఇంచార్జిగా కొనసాగుతున్నాం. రెండు ప్రాంతాల్లో మూగజీవాలకు వైద్యం అందిస్తున్నాం. ఆసుపత్రిలో మందుల విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. వస్తే అన్ని జీవాలకు సక్రమంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్, ఇంచార్జి పశువైద్యాధికారి, దోమ

వెంటనే రుణమాఫీ చేయాలి

వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన



వ్యవసాయ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కొడంగల్ రూరల్: రుణమాఫీ కాని రైతులకు ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని రైతు సంఘం నాయకులు కూర వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతు సదస్సులో పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారని, నియోజకవర్గంలోనే చాలా మంది రైతులకు ఇప్పటివరకూ మాఫీ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ రుణమాఫీ కాని రైతులకు మాఫీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

ధారూరు: ధారూరు మండలంలోని చింతకుంట గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులను చేయిస్తున్నట్లు ధారూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాణిక్యం తెలిపారు.



పనులు ప్రారంభిస్తున్న మాణిక్యం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కేశవులు

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కేశవులు

దోమ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కేశవులు డిమాండ్ చేశారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలో ఆ సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన జీపీఎఫ్, సీపీఎస్, టీఎస్ జీఎల్ఐ, పీఆర్సీ పెండింగ్ బిల్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతి ఉపాధ్యాయుడికి హెల్త్‌కార్డు అందించి వారి ఆరోగ్యాలను కాపాడేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి మండల కేంద్రానికి పీఆర్టీయూ భవనం నిర్మించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం డీఎస్సీ 2024 ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్, కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి వెంకటయ్య, గౌరవఅధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

◆ కొనసాగుతున్న దీక్షలు

బొంరాస్‌పేట: సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలతో, మలిదశ ఉద్యమాలను తలపించాయి. బొంరాస్‌పేటతోపాటు కొడంగల్ నియోజవర్గం నుంచి సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, కేజీబీవీ ఉద్యోగులు పెద్ద ఎత్తున వెళ్లారు. తమను రెగ్యులర్, విద్యాశాఖలో విలీనం చేయాలంటూ ధర్నా నిర్వహించి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల నియోజకవర్గ సీఆర్‌పీలు రాందాస్, బావుసింగ్, శ్రీనివాస్, దస్తప్ప, ఎమ్మార్సీ ఉద్యోగులు రాఘవేందర్, గౌసుద్దీన్ పాల్గొన్నారు.

◆ వక్ఫ్ భూములను పరిరక్షించాలి

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలో వందలాది ఎకరాల వక్ఫ్ భూముల క్రయ విక్రయాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉప సర్పంచు ఎస్ఎం గౌసన్ కోరారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

◆ బ్యూటీషియన్ కోర్సుపై అవగాహన



బ్యూటీపార్లర్‌లో ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ విద్యార్థినులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్లోని ఒకేషనల్ విద్యార్థులకు బ్యూటీషియన్ కోర్సుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు భార్గవి శుక్రవారం పరిగి పట్టణంలోని పలు బ్యూటీ పార్లలకు వెళ్లి అక్కడి పరిస్థితులపై, బ్యూటీషియన్ పనులను గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ఇటువంటి వాటి వల్ల వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా ఇలాంటి కోర్సులు ఉపయుక్తంగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.

క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలి

ఎంఈఓ వెంకట్



పలుగు తండాలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

దోమ: విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలని ఎంఈఓ వెంకట్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పలుగుతండా పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని చిన్నారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వెంకట్ హాజరయ్యారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్, పలుగుతండా ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి సందీప్, చైర్మన్ నీలాభాయ్, ఉపాధ్యాయులు రవి, అంగన్‌వాడీ టీచర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



బూత్‌కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న మల్లేశ్‌పటేల్ తదితరులు

పూడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కండ్లపల్లి, కంకల్, తదితర గ్రామాల్లో బూత్‌కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వార్డు నుంచి పోటీలో ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బూత్‌కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాఘవేందర్, మండల ఇంచార్జి రాముయాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, శేఖర్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



నాగవరం అంగన్‌వాడీ సెంటర్‌లో భోజనం చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

బంట్వారం: విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని ఎంఈఓ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కోట్‌పల్లి కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వంట గది, సరుకులు, కూరగాయల స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉండాలన్నారు. వంట గది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నాగవరం అంగన్‌వాడీ కేంద్రంలో..

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నాగవరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం విద్యార్థుల్తో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు నాణ్యతతో రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. పిల్లలు సెంటర్‌కు గైర్హాజర్ కాకుండా చూడాలన్నారు. ఆటపాటలతో పాటు అక్షరాలు నేర్పించాలన్నారు. అనంతరం ఆయన బంట్వారం కేజీబీవీని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ వెంకన్నగౌడ్, ఎంఈఓ హరిలాల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లోతికుంటతండా, ఏనెమీదితండా తదితర పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సరుకులు, వంట తీరును ముమ్మరంగా పరిశీలించారు. ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మెనూ ప్రకారం అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



బంట్వారం: భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రప్ప



బొంరాస్‌పేట: విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ హరిలాల్

శబరిమలకు అయ్యప్ప స్వాములు

పూడూరు: మండల పరిధిలోని కంకల్ గ్రామంలో దీక్ష చేపట్టిన అయ్యప్పస్వాములు శుక్రవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. 41 రోజులుగా అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన స్వాములు గ్రామంలో ఇరుముడి పూజ నిర్వహించారు. అనంతరం ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయలుదేరారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు



దుద్యాల్: హస్నాబాద్‌లో సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి

బొంరాస్‌పేట: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తారని ఎంపీడీఓ వెంకన్నగౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వం శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మండల పరిధిలోని మెట్లకుంట, ఎన్కేపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన సర్వే నమోదును ఎంపీడీఓ వెంకన్నగౌడ్, ఎంపీఓ మహేశ్‌కుమార్ తదితరులు పరిశీలించారు.

దోమలో..

దోమ: అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, వారందరికి ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సర్వేలో తప్పులు ఉండొద్దు: ఎంపీడీఓ మహేశ్‌బాబు

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులు లేకుండా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి, బాస్‌పల్లి, గొడుగోనిపల్లి, దోమ, దొర్నాల్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతూ అనేక సంక్షేమాలను తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మీన, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: ధారూరు మండల పరిధిలోని అంతారం, మోమిన్‌ఖుర్దు, నాగారం గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం ఎంపీడీఓ నర్సింహులు, ఎంపీఓ షఫీఉల్లా పరిశీలించారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 12,226 కుటుంబాలు ఉన్నాయని ఇంతవరకు జీపీ కార్యదర్శులు 2,500 వరకు సర్వే పూర్తి చేశారని వారు వివరించారు. సర్వేలో పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలనీ వారు సూచించారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జోరుగా కొనసాగుతుంది. పంచాయతీ కార్యదర్శులు ప్రజాపాలన దరఖాస్తులో ఉన్న వివరాల ఆధారంగా ఇంటింటికి తిరుగుతూ ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ నమోదు ప్రక్రియను గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు పరిశీలిస్తున్నాయి.



బొంరాస్‌పేట: మెట్లకుంటలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకన్నగౌడ్



ధారూరు: ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహులు, ఎంపీఓ షఫీఉల్లా



దోమ: బాస్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622